కలెక్టర్‌ను కలవాలని ప్రజావాణికి వినతి



ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటున్న ఆటోడ్రైవర్లు

మేడ్చల్: తమ సమస్యలు జిల్లా కలెక్టర్‌కు వివరించేందుకు అవకాశం కల్పించాలని మేడ్చల్ ఆటో డ్రైవర్లు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించారు. మేడ్చల్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ ఆటోయూనియన్ అధ్యక్షుడు విజయరావు కలెక్టర్‌ను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆటో డ్రైవర్లు డబుల్‌బెడ్రూమ్‌లు, రాజీవ్‌యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్నా.. మంజూరు కాలేదని, తమ గోస కలెక్టర్‌కు వివరించడానికి అవకాశం ఇప్పించాలని కోరారు

ఫలహారం బండ్ల ఊరేగింపు



ఆర్టీసీకాలనీ ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: ఫలహార బండ్ల ఊరేగింపు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీకాలనీ, అత్వెల్లిలో ఏడుగుళ్ల అమ్మవారు, దుర్గమ్మ, పోచమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల్లో ఆదివారం బోనాల పండగను ఘనంగా చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన యువకులు, భక్తులు ఆదివారం రాత్రి ఫలహార బండ్లను ఘనంగా ఊరేగించారు. బండ్లకు గొర్రెలను ఏర్పాటు చేసి అమ్మవారి తొట్టెల ఆకట్టుకుంది. ఆర్టీసీ కాలనీలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రారంభించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కీసర: కీసరకు చెందిన గోపాల్‌రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.32,500 చెక్కును సోమవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ చేతులమీదుగా అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కల ఆవశ్యకతపై జూబ్లీహిల్స్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటడంతో పాటు, వాటిని పరిరక్షించేందుకు కృషి చేయాలని రాంపల్లి జూబ్లిహిల్స్ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే మొక్కలను నాటే యజ్ఞాన్ని ఒక బాధ్యతగా తీసుకుని తద్వారా దేశ ప్రజల ఆయురారోగ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అంతకుముందు విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలను నాటడంతో పాటు, చెట్ల ఆవశ్యకతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

100 మీటర్లకు ఓ స్పీడ్ బ్రేకర్ !



కాలనీలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

పోచారం: నారపల్లిలోని శివాజీనగర్ 4వ వీధిలో 100 మీటర్ల దూరంలోనే 5 స్పీడ్ బ్రేకర్లు వేయడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. బైకులు, కార్ల కింది భాగంలో స్పీడ్‌బ్రేకర్లు తాకుతున్నాయి. అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల వెన్నుపూస దెబ్బ తింటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వాటిపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జాడలేని వాన !

- అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఎండిపోతున్న బోర్లు
- పట్టణంలోని పలు కాలనీల్లో తీవ్ర నీటి ఎద్దడి



మేడ్చల్‌లో నీటికోసం వేచి ఉన్న ట్యాంకర్లు

మేడ్చల్: ఎండాకాలం పోయి వర్షాకాలం సగం ముగుస్తున్నా.. మేడ్చల్ పరిసరాల్లో గత 4 నెలలుగా సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో మేడ్చల్ పట్టణంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో క్రమేపీ నీటి సమస్య పెరుగుతోంది. ప్రధానంగా బహుళ అంతస్తుల భవనాలకు నీటి సరసరా చేయడంలో బోర్లు కీలకంగా ఉండటంతో బోర్లు ఎండిపోతుండటంతో నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుంది.

ఏప్రిల్ మొదటి వారంలోనే..

చెరువులకు దూరంగా ఉన్న కాలనీల్లో గత ఏప్రిల్ మొదటి వారంలోనే సమస్య ప్రారంభంకావడం, తాజాగా పట్టణం మొత్తం విస్తరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీటి సరఫరాను గతంలో కంటే తక్కువగా సరఫరా చేయడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

మేడ్చల్ పట్టమంతా...

మేడ్చల్ పట్టణం మధ్యలో నుంచి 44వ జాతీయ రహదారి వెళుతుంది. జాతీయ రహదారికి ఓ వైపు పాత మేడ్చల్ , కొన్ని కాలనీలు, కాలనీపైన రెండు చెరువులు ఉన్నాయి. గత వేసవిలో రోడ్డుకు అవతలి వైపు, చెరువులకు దూరంగా ఉన్న కాలనీల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దాదాపు పట్టణంలోని అన్ని కాలనీల్లో నీరు పాతాళంలోకి వెళ్లడంతో పాటు ఎటు చూసినా బోర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మేడ్చల్‌లో 1000 ఫీట్ల లోతు బోరు బావులు ఉన్నా.. వాటిలో చుక్కనీరు కనబడటం లేదు.

ప్రధాన చెరువుల్లో తగ్గుతున్న నీరు..

మేడ్చల్‌కు అధికంగా భూగర్భ జలాలు అందించే చెరువులు రెండు ఉన్నాయి. మేడ్చల్ పెద్ద చెరువు, కాలనీల మధ్య ఉన్న తుమ్మ చెరువు. గతంలో నీటితో ఎప్పుడూ ఇవి నిండుగా ఉండేవి. ఆయకట్టు లేకపోవడం, వర్షాలు సీజన్‌తో సంబంధం లేకుండా కురియడంతో చెరువులు నిండుగా ఉండేవి. ప్రస్తుతం చెరువులు ఎండిపోతున్నా.. నీటిమట్టం తగ్గడంతో చెరువుకు దూరంగా ఉన్న కాలనీలకు భూగర్భ జలాలు అందకపోవడంతో ఆ ప్రాంతాలలో నీటి సమస్య ఏర్పడింది.

జోరుగా ట్యాంకర్లు..

మేడ్చల్‌కు మిషన్ భగీరథ పథకం రాకముందు వేసవి వచ్చిందంటే ట్యాంకర్లు కనిపించేవి. వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి ఏర్పడి అందరూ.. ట్యాంకర్ల ద్వారానే నీటిని తెప్పించుకునేవారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో తాగునీటి సమస్య ఈ తరహాలో ఉండేది. ఆ తర్వాత వర్షాలు కురవడం, ఇంటింటికీ భగీరథ ద్వారా నీరు రావడంతో సమస్య పెద్దగా కనిపించలేదు. ట్యాంకర్లు పారిశ్రామిక అవసరాలకు మినహా గృహ అవసరాలకు ఎక్కడా కనిపించేవి కావు. తాజాగా వర్షం ముఖం చాటేయడంతో తిరిగి మళ్లీ అధికంగా ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయి.

అన్ని కాలనీల్లో ఒకే పరిస్థితి..

పట్టణంలోని కేఎల్‌ఆర్, బాలాజీనగర్, రాఘవేంద్ర నగర్ కాలనీ, ఉమానగర్, సూర్యనగర్, చంద్రనగర్, ఎన్‌జీటీస్‌కాలనీ, వెంకట్రామయ్య, వెంకట్రాంరెడ్డి తదితర కాలనీల్లో సమస్య అధికంగా ఉండగా.. పట్టణంలోని మిగతా అన్ని కాలనీల్లో బోర్లు ఎండిపోవడంతో అంతటా నీటికోసం ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుంది.

ఒక్కో ట్యాంకర్‌కు రూ.800

మేడ్చల్ శివార్లలో బోరు బావుల వద్ద నీరు పుష్కలంగా ఉండటంతో ట్యాంకర్ వ్యాపారులు అక్కడి నుంచి నీటిని తెస్తూ.. రూ.600 నుంచి రూ.800 వరకు ఒక్కో ట్యాంకర్ నీటిని విక్రయిస్తున్నారు. ట్యాంకర్ రూ.600 నుంచి రూ.800 డ్రైవర్‌కు రూ.50 నుంచి రూ.100 రోజుకూ పెద్ద భవనాల వారు నీటి కోసం రూ.900 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. చెరువులలో నీరున్నా భూతాపం అధికంగా ఉండటం, 3 నెలల నుండి సరైన వర్షపాతం కురవకపోవడంతో మేడ్చల్ మున్సిపల్‌వాసులు అవసరాలకు ఉపయోగించే నీటికోసం నిత్యం ఇబ్బంది పడాల్సివస్తుంది.



కీసర ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న శివాజీనగర్ మహిళలు, కాలనీవాసులు

ఖాళీ బిందెలు, డ్రమ్ములతో నిరసన..

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసర శివాజీనగర్‌లో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మహిళలు ఖాళీ బిందెలు, డ్రమ్ములతో రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, 5 రోజులకు ఒక్క డ్రమ్ము సరిపడా నీరు సరఫరా అవుతోందని దీంతో నీరు సరిపోక సతమతమవుతున్నామన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి నిరసన చేస్తున్న వారిని సముదాయించి నీటిసమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. దీంతో కాలనీ మహిళలు ధర్నా విరమించారు.

హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

శామీర్‌పేట్: తుర్కపల్లి గ్రామంలోని కూకట్‌పల్లి బ్రాంచ్‌కు చెందిన మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సోమవారం హాస్టల్ గేట్ వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానం చేసేందుకు సరిపడ బాత్రూమ్‌లు లేవని, ఉన్న వాటికి తలుపులు కూడా సరిగ్గా పనిచేయడం లేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేస్తే దురుసుగా మాట్లాడుతున్నారని వాపోయారు. 500 మంది విద్యార్థులకు 2 బాత్రూమ్‌లు మాత్రమే ఉన్నాయని, అవి కూడా సరిగ్గా లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు ,బస్తీల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కరమవుతాయనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

తప్పనిసరిగా కారణం చెప్పాలి..

దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు గల కారణాలను తప్పనిసరిగా అర్జీదారులకు వివరించాలని అధికారులకు ఆయన సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో 96 దరఖాస్తులు వచ్చినట్లు



కలెక్టర్ ప్రకటించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అధిక ఫిర్యాదులు

ప్రజావాణిలో కలెక్టర్‌కు వచ్చిన దరఖాస్తుల్లో కలెక్టరేట్ వివిధ విభాగాల్లో సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. కలెక్టరేట్‌లోని 'ఈ' విభాగం ఫిర్యాదులు 10 ఉండగా.. 'డి' విభాగానివి 3 , హౌజింగ్‌శాఖ 9 ఉన్నాయి. ఇరిగేషన్ శాఖ 5 , బోడుప్పల్, గుండ్ల పోచంపల్లి, దమ్మాయిగూడ, పీర్జాదిగూడ, నాగారం, పోచారం, జవహర్‌నగర్, ఘట్‌కేసర్, కొంపెల్లి, నిజాంపేట పురపాలక సంఘాలతో పాటు అల్వాల్, మల్కాజిగిరి, ఉప్పల్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన ఫిర్యాదులు 11 వరకు ఉన్నాయి.

సమీకృత వ్యర్థాల పార్కు సందర్శన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్‌లోని సమీకృత వ్యర్థాల పార్కు (డంపింగ్‌యార్డు)ను భాష్యం బ్లూమ్స్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. వందరోజుల కార్యాచరణ, స్వచ్ఛ పీర్జాదిగూడలో భాగంగా సోమవారం విద్యార్థులు సమీకృత వ్యర్థాల పార్కులో చెత్తను వేరు చేసే విధానాలను పరిశీలించారు. తడిచెత్తతో బ్రికెట్స్ తయారీ, కంపోస్టు, పొడిచెత్తతో రీసైక్లింగ్ చేస్తున్న వివిధ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్వచ్ఛ పీర్జాదిగూడకు మేముసైతం అని విద్యార్థులు ముందుకొచ్చి పలు కార్యక్రమాల్లో పాలుపంచుకుని ప్రజల్లోకి స్వచ్ఛత నినాదాన్ని తీసుకెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. తడి, పొడిచెత్త వేరు చేసే విధానం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్,కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బాల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పీర్జాదిగూడలోని సమీకృత పార్కు వద్ద విద్యార్థులు, మున్సిపల్ అధికారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఘట్‌కేసర్ టౌన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కొండాపూర్ గ్రామంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. బాలాజీనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ లక్ష్మీనర్సింహ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయాంజాల్ పరిధిలోని డీఎంసీ, అంజన ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీఎంసీ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సేవా సంఘాలు సంఘటితంగా ఉండాలి

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘానికి ఇటీవల ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా సంఘాలు సంఘటితంగా ఉండి తమ సంఘం అభివృద్ధికి పాటుపడుతూనే సమాజంలోని పేదలకు బలహీన వర్గాలకు చేయూతను అందించాలని సూచించారు. సేవాసంఘం అధ్యక్షుడు ఆరూరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి ముత్యాల నరేష్, కోశాధికారి భరత్, ముత్యాల నరసింహ, జుట్టు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగులగొట్టి దొంగతానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం ఎంహెచ్‌ఆర్ కాలనీలో నివసించే సంతోష్‌కుమార్ తిరుపతికి వెళ్లి సోమవారం తిరిగొచ్చాడు. వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. రూ.లక్ష నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందని, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనమహోత్సవంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మల్లాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం నాచారం డివిజన్‌కు చెందిన మాజీ సైనికులు, ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం వంద శాతం అయ్యేలా చూడాలని సూచించారు.

☛ తెలంగాణ, ఏపీ మాజీ సైనికుల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 1 నుంచి 15 వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో 150 డివిజన్లలో 50 వేల మంది మాజీ సైనికులు దాదాపు 79వేల మొక్కలను నాటుతున్నట్లు ప్రకటించారు.



మాజీ సైనికులతో మంత్రి శ్రీధర్‌బాబు

ఇందిరమ్మ ఇంటితో | పేదల సొంతింటి కల సాకారం



కొండాపూర్‌లో శంకుస్థాపన చేస్తున్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరనుందని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్, కొండాపూర్, గుంటిగూడలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ– బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తుందన్నారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచులు యాదగిరియాదవ్, మమత, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాధవరెడ్డి, అంజిరెడ్డి, జంగయ్య, మల్లేష్, చిత్తారియాదవ్, అనిత, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దేవేందర్, ఖయూమ్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉంటేనే గుర్తింపు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో రైమల్

రోడ్లు, భవనాల శాఖ తెలంగాణ చీఫ్ ఇంజినీర్ రైమల్

ఘట్‌కేసర్: ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉంటేనే సివిల్ ఇంజినీరింగ్ రంగంలో రాణిస్తారని రోడ్లు, భవనాలశాఖ తెలంగాణ చీఫ్ ఇంజినీర్ రైమల్ అన్నారు. సోమవారం ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి (కేపీఆర్‌ఐటీ)అటనామస్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేపీఆర్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఘట్‌కేసర్‌లో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ.. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ– బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, మమత, రూప్‌సింగ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాధవరెడ్డి, జంగయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కీసరలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర అంబేడ్కర్‌నగర్ కాలనీలో డెంగీ, సీజనల్ వ్యాధులపై తడి, పొడి చెత్త వ్యర్థాల వేరు చేయడంపై కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన కల్పించడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలు తొలగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సుల హోదా పేర్లలో మార్పులు

మల్లాపూర్: నర్సింగ్ ఆఫీసర్లుగా, నర్సింగ్ సిబ్బంది పేర్లను మారుస్తూ.. కార్మికశాఖ తీసుకున్న నిర్ణయంపై సోమవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నర్సులు కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ ఎంప్లా యిస్ యూనియన్ సెక్రటరీ వేణుకుమార్ మాట్లాడుతూ.. 2023లోనే హోదాల పేర్లను మారుస్తూ.. తీసుకున్నప్పటికీ ఈఎస్ఐలో అమలు కాలేదు. అమలు చేయడానికి తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 2023 నుంచి ఇప్పటి వరకు పోరాటం చేశామన్నారు. ఈ పోరాటం ఫలితామే స్టాఫ్ నర్సుని నర్సింగ్ అధికారిగా, హెడ్ నర్సుని సీనియర్ నర్సింగ్ అధికారిగా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 హోదాను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 చీఫ్ నర్సింగ్ అధికారిగా పిలవనున్నారని స్పష్టం చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ –1 గ్రేస్, యూనియన్ కార్యదర్శి వేణుకుమార్, సౌందర్య, భాగ్య, అరుణ, జమియా, అంజని, రఘు, ధన్‌రామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నాచారం ఈఎస్ఐలో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న నర్సులు

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి : మౌలాలి డివిజన్ బృందావన్‌కాలనీలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ పరిశీలించారు. సోమవారం తుదిదశకు చేరుకున్న నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గత దశాబ్దాలుగా సమస్యలకు నెలవుగా ఉన్న కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత కార్పొరేటర్ సునీతకే దక్కుతుందని పలువురు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. బృందావన్‌కాలనీ ప్రతినిధులు ఝాన్సీ, వెంకటరమణ, రేఖ, సుజాత, శిరీషా, బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ శివగౌడ్, కార్యదర్శి వెంకటేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత